నమస్తే తెలంగాణ | www.ntnews.com

తండ్రి, కుమార్తెల ఎన్నికల పోరు

రసవత్తరంగా 'అహేరి' పోటీ

ముంబై, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర ఎన్నికల చరిత్రలో మొదటిసారి తండ్రి కుమార్తెలు రాజకీయ ప్రత్యర్థులు అయ్యారు. అహేరి నియోజకవర్గంలో తండ్రి, కుమార్తె పోటీ హాట్ టాపిక్‌గా మారింది. ఎన్సీపీ (అజిత్ పవార్) తరఫున తండ్రి ధర్మారావు బాబా ఆత్రమ్, ఎన్సీపీ (శరద్ పవార్) తరఫున కుమార్తె భాగ్యశ్రీ బరిలో నిలబడ్డారు. 72 ఏండ్ల తన తండ్రి ఎక్కడికీ కదలలేరని, ప్రజలకేం చేస్తారని కుమార్తె ప్రశ్నిస్తున్నారు. తన కూతురికి వంట రాదని, అల్లుడు నిత్యం జొమాటో నుంచి అన్నం తెప్పించుకుని తింటాడని.. అలాంటిది ప్రజలకు ఏం చేస్తుందని మంత్రి ధర్మారావు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి.

పంజాబ్‌లో 105 కిలోల హెరాయిన్ స్వాధీనం

చండీగఢ్ : పాకిస్థాన్ నుంచి మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసే ముఠాను పట్టుకున్నట్లు పంజాబ్ పోలీసులు ఆదివారం చెప్పారు. పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ మాట్లాడుతూ, పాకిస్థాన్ నుంచి డ్రగ్స్‌ను రవాణా చేయడానికి జల మార్గాలను ఉపయోగించుకుంటున్నారన్నారు. విదేశీ డ్రగ్ స్మగ్లర్‌తో సంబంధాలు గల ఇద్దరిని అరెస్ట్ చేసి, 105 కిలోల హెరాయిన్, టైర్లలోని పెద్ద రబ్బర్ ట్యూబులు, ఐదు విదేశీ తయారీ, ఒక దేశవాళీ తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

మహిళా ఓటర్ల చేతిలో జార్ఖండ్ జాతకం!

32 స్థానాల్లో వారి సంఖ్య అధికం

రాంచీ, అక్టోబర్ 27: 81 అసెంబ్లీ స్థానాలున్న జార్ఖండ్‌లో 32 నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్నారు. దీంతో త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో వారు నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఈ 32 నియోజక వర్గాల్లో 26 ఎస్టీలకు రిజర్వ్ చేసినవి ఉన్నాయి. ప్రస్తుత సీఎం హేమంత్ సొరేన్, మాజీ సీఎం చంపయి సొరేన్ పోటీ చేస్తున్న స్థానాలు కూడా ఇందులోనే ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 2.60 కోట్లు కాగా అందులో పురుషుల సంఖ్య 1.31 కోట్లు, మహిళల సంఖ్య 1.29 కోట్లు. ఈ నేపథ్యంలో మహిళల ఓట్లను కొల్లగొట్టడానికి పార్టీలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి.

సూడాన్‌లో నరమేధం

పారా మిలిటరీ దాడుల్లో 120 మంది పౌరుల మృతి

కైరో: సూడాన్‌లో సైన్యం, పారా మిలిటరీ దళాల మధ్య ఘర్షణలు సామాన్య ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ నెల 20-25 తేదీల మధ్య ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అనే పారామిలిటరీ దళాలు తూర్పు-మధ్య సూడాన్‌లోని గ్రామాలపై విరుచుకుపడ్డాయి. విచక్షణ లేకుండా కాల్పులు జరిపి, బాలికలు, మహిళలపై అత్యాచారాలకు తెగబడ్డాయి. దీంతో 120 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, సుమారు 200 మంది గాయపడ్డారు. దాదాపు ఏడాదిన్నర నుంచి జరుగుతున్న ఈ ఘర్షణల వల్ల లక్షలాది మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. గెజీరా ప్రావిన్స్‌లో జరిగిన ఈ దారుణాల గురించి ఐక్య రాజ్య సమితి, ఓ వైద్యుల సంఘం బయటపెట్టాయి. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులతోపాటు ఓపెన్ మార్కెట్లను కూడా ఈ దళాలు దోచుకున్నాయని వెల్లడించాయి.

ప్రకృతి రక్షణ సూచీలో అట్టడుగున భారత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ప్రపంచ ప్రకృతి సంరక్షణ సూచీ(ఎన్సీఐ)లో 176 ర్యాంక్‌తో భారత్ అట్టడుగున అయిదో స్థానంలో నిలిచింది. జీవ వైవిధ్యం కోల్పోవడం, ఆవాసాల విధ్వంసం, కాలుష్యం, అసమర్థ సంరక్షణ విధానాలను ఈ ర్యాంకింగ్ ప్రతిబింబించింది. పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల భూమి కాలుష్యం ఎక్కువవుతున్నదని.. ఇది వ్యవసాయోత్పత్తి, పర్యావరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని నివేదిక తెలిపింది. అడవుల నరికివేత కారణంగా 2001-2019 మధ్య కాలంలో భారత్ 23,300 చ.కి.మీల పచ్చదనాన్ని కోల్పోయింది. దీనికి అదనంగా వాతావరణ మార్పులు సున్నితమైన పర్యావరణ వ్యవస్థలపై ప్రభావం చూపించాయి.

అదానీకి కెన్యా కోర్టు షాక్

- రూ.6,189 కోట్ల ప్రాజెక్టు సస్పెండ్
- హైవోల్టేజ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ నిర్మాణ, నిర్వహణ ఒప్పందం రద్దు
- ఇదివరకే కెన్యట్టా విమానాశ్రయ విస్తరణ ఒప్పందం నిలిపివేత
- అదానీ సంస్థపై కెన్యాలో వ్యతిరేకత

న్యూఢిల్లీ: మోదీ ఆప్తమిత్రుడు అదానీకి కెన్యాలో మరో షాక్ తగిలింది. హైవోల్టేజ్ విద్యుత్తు లైన్ల నిర్మాణం, నిర్వహణ కోసం 30 ఏండ్లకు గానూ కెన్యా ప్రభుత్వంతో కుదుర్చుకున్న 736 మిలియన్ డాలర్ల (సుమారు రూ.6,189 కోట్లు) ఒప్పందాన్ని కెన్యా కోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు బ్లూంబర్గ్ ఆదివారం వెల్లడించింది. రాజధాని నైరోబీలోని జోమో కెన్యట్టా విమానాశ్రయాన్ని అదానీ గ్రూపునకు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు నిరసనకు దిగడంతో ఇదివరకే ఆ ఒప్పందాన్ని అక్కడి ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా విద్యుత్తు ప్రాజెక్టును కోర్టు రద్దు చేయడంతో అదానీ గ్రూపనకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది.

పారదర్శకత పాటించలేదు..

కెన్యాలో విద్యుత్తు లైన్ల నిర్మాణం, నిర్వహణ కోసం ఈ నెల ప్రారంభంలో కెన్యా ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ (కెట్రాకో)తో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఒప్పందం కుదుర్చుకున్నది. అయితే ఈ ఒప్పందం పారదర్శకంగా లేదని, రాజ్యాంగ నిబంధనలు పాటించలేదని 'లా సొసైటీ ఆఫ్ కెన్యా' కోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై ముందుకెళ్లొద్దని, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌తో కొత్తగా ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవద్దని అక్కడి హైకోర్టు తాజాగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ప్రాజెక్టు కెన్యా ప్రజలకు పిడుగుపాటుగా మారనుందని, విద్యుత్తు చార్జీలు రెట్టింపయ్యే ప్రమాదం ఉన్నదని అక్కడి మీడియాలో కథనాలు వచ్చాయి. ప్రస్తుతం యూనిట్ చార్జీ కెన్యా కరెన్సీ ప్రకారం ఎస్‌హెచ్ 5.51గా ఉండగా, ఇది రెట్టింపై ఎస్‌హెచ్ 11.14కి చేరుకుంటుందని పేర్కొన్నాయి. ఇది ప్రజలకు నిజంగా విద్యుదాఘాతమేనని, అదానీ సంస్థకు ప్రయోజనం చేకూర్చేందుకే ప్రభుత్వం ఈ ఒప్పందం కుదుర్చుకుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విమానాశ్రయ ప్రాజెక్టు రద్దు

నైరోబీలోని కెన్యట్టా విమానాశ్రయ ఆధునికీకరణ, 30 ఏండ్లపాటు నిర్వహణ కోసం కెన్యా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీతో అదానీ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ విమానాశ్రయ కార్మికులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. అదానీ కంటే ఏఎల్‌జీ అనే స్థానిక సంస్థ మెరుగైన ప్రతిపాదన చేసినప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా అదానీ సంస్థకు ప్రాజెక్టు కట్టబెట్టిందని విమర్శించాయి. దీంతో ఈ ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దుచేసింది. టెండరు ప్రక్రియపై ప్రత్యేక ఆడిట్ జరిపే వరకు అదానీ సంస్థతో తదుపరి ప్రక్రియను నిలిపివేయాలని నిర్ణయించింది.

మోదానీ బంధం వల్లే!

అదానీ-మోదీ బంధంపై కెన్యా మాజీ ప్రధాని ఒడింగా ఇటీవల చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ప్రధాని మోదీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను ఆ రాష్ట్రంలో ప్రధాని హోదాలో పర్యటించినట్టు ఆయన పేర్కొన్నారు. మోదీ ఆహ్వానం మేరకే తాను, తన సిబ్బంది పర్యటించినట్టు చెప్పారు. అదానీ గ్రూప్ కంపెనీలకు చెందిన పోర్టు, పవర్‌ప్లాంట్, రైల్వేలైన్, ఎయిర్‌స్ట్రిప్ తదితర ప్రాజెక్టులను మోదీ ప్రత్యేకంగా వివరించినట్టు తెలిపారు. దీంతో మోదానీ బంధం మరోసారి బయటపడిందని ప్రతిపక్షాలు కేంద్రంపై విరుచుకుపడ్డాయి.

శ్రీలంక లోనూ ఇలాగే

శ్రీలంకలో 500 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఎలాంటి పోటీ లేకుండా అదానీ గ్రూపనకు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. అదానీ కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు ప్రధాని మోదీ అప్పటి శ్రీలంక అధ్యక్షుడు రాజపక్సపై ఒత్తిడి తెచ్చినట్టు ఆ దేశ విద్యుత్తు సంస్థ అధ్యక్షుడిగా పని చేసిన ఫెర్డినాండో 2022లో బయట పెట్టారు. పోటీ లేకపోవడంతో అదానీ గ్రూపనకు 25 ఏండ్లలో 4 బిలియన్ అమెరికన్ డాలర్ల అయాచిత లాభం చేకూరుతుందని శ్రీలంక ఇంజినీర్లు తేల్చిచెప్పారు. దీంతో గత ప్రభుత్వ పెద్దలతో అదానీ గ్రూప్‌లోపాయికారీ ఒప్పందాలపై పునః సమీక్షించనున్నట్టు శ్రీలంక కొత్త ప్రభుత్వం ప్రకటించింది.



ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి కారణంగా చెలరేగిన మంటలు

ఇరాన్‌కు భారీ దెబ్బ

- బాలిస్టిక్ క్షిపణి ఫ్యాక్టరీ పూర్తిగా ధ్వంసం
- పునరుద్ధరణకు రెండేళ్ల సమయం పట్టే అవకాశం

టెహ్రాన్, అక్టోబర్ 27: ఇజ్రాయెల్ వాయుసేన శనివారం తెల్లవారుజామున జరిపిన దాడుల్లో ఇరాన్‌ను భారీగానే దెబ్బతీసింది. ఈ దాడిలో తమ సైనికులు నలుగురు మరణించారని, రాడార్ వ్యవస్థకు నష్టం ఏర్పడిందని, మొత్తం మీద నష్టం పరిమితంగానే ఉందని ఇరాన్ ప్రకటించింది. అయితే వాస్తవానికి ఈ దాడిలో ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి తయారీ ఫ్యాక్టరీ నాశనం అయ్యి, భారీ నష్టం ఏర్పడిందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ సౌదీ ఎలఫ్ న్యూస్ వెబ్‌సైట్ వెల్లడించింది. ముఖ్యంగా ఖైబర్, కాస్సీమ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను శక్తివంతం చేయడానికి ఉపయోగించే భారీ ఇంధన మిక్సర్లపై ఇజ్రాయెల్ వాయు సేన విరుచుకుపడిందని తెలిపింది. దీంతో నాశనమైన ఈ ఫ్యాక్టరీని పునరుద్ధరించడానికి రెండేండ్లు పట్టవచ్చునని పేర్కొంది.

గాజాపై దాడి.. 22 మంది మృతి

ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ దళాలు ఆదివారం జరిపిన దాడిలో 22 మంది మృతి చెందారు. మృతులలో చాలామంది మహిళలు, పిల్లలు ఉన్నారని పాలస్తీనా అధికారులు తెలిపారు. ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు మూడో వారానికి చేరుకున్నాయి.

టెల్ అవీవ్‌లో ఉగ్రదాడి

ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో ఒక ట్రక్కు బస్టాప్‌పై దూసుకువచ్చిన ఘటనలో ఒకరు మృతిచెందగా, 35 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదం ఉగ్రదాడిగా అనుమానిస్తున్నామని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఇలా ట్రక్కులతో ఉగ్ర దాడులు చేయడం పాలస్తీనియన్లు చాలాఏండ్లుగా చేస్తుండటంతో ఇందులో వారి ప్రమేయాన్ని అధికారులు ఆరా తీస్తున్నారు.

విషమంగా ఖమేనీ ఆరోగ్యం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 85 ఏండ్ల ఖమేనీ ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. దీంతో ఆయన వారసుడి ఎంపిక కోసం కసరత్తు మొదలైంది. ఇజ్రాయెల్ వాయుసేన దాడిపై ఇరాన్ ఎలా ప్రతీకారం తీసుకుంటుందో అని అనుకుంటుండగా, ఖమేనీ అనారోగ్యం వెలుగులోకి వచ్చింది. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం ఖమేనీ రెండో కుమారుడు మొజతాబ ఖమేనీ (55)ని వారసునిగా ఎంపిక చేయనున్నారు. ఇరానీ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కూడా ఖమేనీ వారసుని ఎంపిక కోసం చూస్తున్నది.

ఎలా సత్తా చూపాలో అధికారులే నిర్ణయించాలి: ఖమేనీ

ఇజ్రాయెల్ దాడులపై ప్రతిదాడి చేస్తారా? అన్న ప్రశ్నపై ఇరాన్ చీఫ్ అయతుల్లా ఖమేనీ స్పందించారు. 'ఇజ్రాయెల్ మాపై దాడిని అతిశయోక్తిగా చూపకూడదు. అలా అని తక్కువగా అంచనా వేయరాదు. ఇరాన్ ప్రజల శక్తిని, సత్తాను ఇజ్రాయెల్ పాలకులకు ఎలా చూపాలో, ఈ దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే చర్యలను ఎలా తీసుకోవాలో అధికారులే నిర్ణయించాలి' అని పేర్కొన్నారు.

ప్రభుత్వ పెద్దలను కలిస్తే వాళ్లతో డీల్ చేసుకున్నట్టా!

- న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉంది
- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో న్యాయవ్యవస్థకు పాలనాపరమైన సంబంధాలు ఉంటాయని, వీటిపై మాట్లాడుకునేందుకు ప్రభుత్వ పెద్దలతో సీజేఐ, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు సమావేశమవుతారని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డీవై చంద్రచూడ్ అన్నారు. ప్రభుత్వ పెద్దలను కలిస్తే.. ఇద్దరి మధ్యా ఏదో డీల్ కుదిరినట్టు భావించరాదని స్పష్టం చేశారు. మనదేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. 'న్యాయవ్యవస్థకు కావాల్సిన నిధులను (బడ్జెట్) ప్రభుత్వాలు విడుదల చేస్తాయి కాబట్టే సీఎంలతో సమావేశాలు తప్పనిసరి. కేవలం లేఖలు పంపి ఊరుకుంటే పనులు కావు. న్యాయమూర్తులు నేరుగా మాట్లాడాల్సి ఉంటుంది. జడ్జిలతో జరిగిన సమావేశంలో ఏ సీఎం కూడా పెండింగ్ కేసుల ప్రస్తావన తేలేదు. జడ్జీలతో జరిగే మీటింగ్స్‌లో రాజకీయ వ్యవస్థ చాలా పరిపక్వతతో వ్యవహరించింది' అని చెప్పారు. కొద్ది రోజుల క్రితం సీజేఐ ఇంట జరిగిన ఓ పూజా కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావటాన్ని విపక్షాలు ప్రశ్నించాయి. న్యాయవ్యవస్థ పట్ల విశ్వసనీయతను దెబ్బతీస్తుందని శివసేన (యుబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆందోళన వ్యక్తం చేశారు.

బీర్లపై పన్నుల పెంపు వద్దు

కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌కు బీర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లేఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: బీరులో ఆల్కహాల్ శాతాన్ని బట్టి ఎక్సైజ్ డ్యూటీ విధించాలన్న కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై బీరు అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బీర్లను వర్గీకరిస్తూ వాటిపై 35శాతం వరకు పన్నులు పెంచాలన్న ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని కర్ణాటక ప్రభుత్వాన్ని బీఏఐ కోరింది. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వల్ల బీర్ల ధరలు అనూహ్యంగా పెరిగే అవకాశముందని, సామాన్యులకు అందుబాటులో ఉండవని సీఎం సిద్దరామయ్యకు బీఏఐ లేఖ రాసింది. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కూడా ప్రభావితమవుతుందని, రాష్ట్ర ఆదాయం రూ.400 కోట్ల వరకు పడిపోతుందని పేర్కొన్నది. బీరు తయారీ కంపెనీల రూ.5వేల కోట్ల పెట్టుబడులపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కర్ణాటకలో బీర్లన్నింటిపైనా ఒకే విధమైన ఎక్సైజ్ డ్యూటీ విధిస్తున్నారు. అలా కాకుండా, ఆల్కహాల్ శాతాన్ని బట్టి బీర్లను మూడు రకాలుగా విడగొట్టాలని, ఎక్సైజ్ డ్యూటీని మూడు విధాలుగా(రూ.10, రూ.16, రూ.20) విధించాలని డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పేర్కొన్నది.

ముంబై రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట

- 10 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- పండుగ సీజన్ కావడంతో పోటెత్తిన ప్రయాణికులు
- తగిన ఏర్పాట్లు చేయని రైల్వే శాఖ అధికారులు
- రైల్వే మంత్రి అసమర్థత వల్లే ఘటన: విపక్షాలు

తొక్కిసలాటలో గాయపడి ప్లాట్‌ఫారంపై పడిపోయిన ఓ ప్రయాణికుడు

ముంబై, అక్టోబర్ 27: ముంబైలోని బాంద్రా రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో ఆదివారం 10 మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. యూపీలోని గోరఖ్‌పూర్ వెళ్లే అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాంపైకి వస్తుండగా, అందులో ఎక్కడానికి పెద్దయెత్తున ప్రయాణికులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది. దీపావళి, ఛాత్ పండుగల నేపథ్యంలో సొంత ఊళ్లకు వెళ్లడానికి పెద్దయెత్తున ప్రయాణికులు బాంద్రా స్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 5.10 గంటలకు రైలు బయలుదేరాల్సి ఉండగా, సుమారు మూడు గంటల ముందు స్టేషన్ ప్లాట్‌ఫాం పైకి రైలు రాగా, ఈ ప్రమాదం జరిగింది. అయితే తొక్కిసలాటలో ఇద్దరే గాయపడ్డారని రైల్వే అధికారులు తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రావడంతో ఈ తొక్కిసలాట చోటుచేసుకుందని రైల్వే అధికారి ఒకరు చెప్పారు. గాయపడిన వారిని దవాఖానలకు తరలించినట్టు పశ్చిమ రైల్వే తెలిపింది.

రైల్వే మంత్రి అసమర్థుడు

బాంద్రా ప్రమాదంపై రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌పై విపక్షాలు తీవ్రంగా దుమ్మెత్తిపోశాయి. ఇలాంటి అసమర్థ వ్యక్తి రైల్వే మంత్రిగా ఉండటం దేశానికి అవమానకరమని శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే మండిపడ్డారు.' రైల్వే మంత్రి నిత్యం బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు జపమే చేస్తారు. సౌకర్యాల లేమితో పేదల ప్రాణాలు పోతున్నా ఆయనకు పట్టదు' అని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ విమర్శించారు.

ప్లాట్‌ఫాం టికెట్ల అమ్మకంపై ఆంక్షలు

బాంద్రా రైల్వే స్టేషన్‌లో ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల రద్దీని నివారించడానికి ముంబైలోని పలు ప్రధాన స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ల విక్రయాలపై తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్, దాదర్, కుర్లా ఎల్‌టీటీ, థాణే, కల్యాణ్, పుణె, నాగ్‌పూర్ స్టేషన్లలో ఈ ఆంక్షలు తక్షణం అమలులోకి వస్తాయని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

హోటళ్లకు బాంబు బెదిరింపులు

తిరుపతి, లక్నో, రాజ్‌కోట్, కోల్‌కతాల్లో అప్రమత్తం

న్యూఢిల్లీ: విమానాలకు బాంబు బెదిరింపులతో ఇప్పటికే ఆందోళన నెలకొనగా, తాజాగా హోటళ్లకు కూడా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతున్నది. తిరుపతి, రాజ్‌కోట్, కోల్‌కతా, లక్నోలోని ప్రముఖ హోటళ్లకు ఈ-మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. పండుగల సీజన్‌లో ఈ దుశ్చర్యలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కోల్‌కతాలోని 10 ప్రముఖ హోటళ్లకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు రావడంతో తనిఖీలు నిర్వహించి, బాంబులు లేవని నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న మూడు హోటళ్లకు శుక్ర, శనివారాల్లో నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. రాజ్‌కోట్‌లో 10 హోటళ్లకు లక్నోలో 10 ప్రధాన హోటళ్లకు ఆదివారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి.

50 విమానాలకు బాంబు బెదిరింపులు

నకిలీ బాంబు బెదిరింపుల బెడద తొలగిపోవడం లేదు. దాదాపు 50 విమానాలకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గడచిన 14 రోజుల్లో 350కిపైగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి.

అవినీతి, విభజిత శక్తులు మా శత్రువులు

- ద్రవిడాన్ని, తమిళ జాతీయతను మా పార్టీ వేరుగా చూడదు
- తొలి రాజకీయ సభలో తమిళ నటుడు, టీవీకే అధినేత విజయ్

బహిరంగ సభకు హాజరైన వేలాది మంది అభిమానులు. ప్రసంగిస్తున్న విజయ్ (ఇన్‌సెట్)

విల్లిపురం, అక్టోబర్ 27: రాజకీయ నేతగా తొలిసారి బహిరంగ సభలో ప్రసంగించిన తమిళ నటుడు, టీవీకే నేత విజయ్ పరోక్షంగా అధికార డీఎంకేను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తమిళగ వెట్రి కజగమ్ పార్టీని ప్రారంభించిన తర్వాత 8 నెలలకు తొలిసారిగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వివిధ అంశాలతో దేశాన్ని విభజించే శక్తులు, అవినీతికి పాల్పడే వారు తమ పార్టీకి శత్రువులని అన్నారు. ద్రవిడాన్ని, తమిళ జాతీయతను తమ పార్టీ వేరుగా చూడదన్నారు. ఈవీఆర్ పెరియార్, కే కామరాజ్ లాంటి నేతల ఆశయాలకు అనుగుణంగా తమ పార్టీ లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాలతో ఏర్పడిందని ఆయన స్పష్టం చేశారు. డీఎంకే, దాని కుటుంబంపై ఆయన విమర్శలు చేస్తూ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని వారు ద్రవిడ మోడల్ ప్రభుత్వంగా పిలుస్తున్నారని అన్నారు. ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్‌లు సినీ రంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించారని, వారు రాజకీయ రంగంలో ప్రవేశించిన అనంతరం కూడా తమ సేవా కార్యక్రమాలతో ప్రజల మనసులను దోచుకున్నారని అన్నారు. పుట్టుకతో అందరూ సమానమే అన్నది తమ పార్టీ సిద్ధాంతమని స్పష్టం చేశారు. తాను పేరు పెట్టకుండా విమర్శలు చేస్తున్నానంటే అది భయంతో కాదని, ఒక గౌరవ ప్రదమైన రాజకీయాలను చేసే లక్ష్యంతో తాను ఇక్కడకు వచ్చానని నటుడు విజయ్ స్పష్టం చేశారు.

మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్‌గా రేచల్

పంజాబ్‌కు చెందిన రేచల్ గుప్తా (20) ప్రతిష్ఠాత్మక మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ కిరీటాన్ని దక్కించుకుని రికార్డు సృష్టించారు. ఈ కిరీటాన్ని సొంతం చేసుకున్న తొలి భారతీయురాలు, మూడో ఆసియావాసిగా ఆమె ఘనత సాధించారు. బ్యాంకాక్‌లో సెప్టెంబరు నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో 68 మంది పాల్గొన్నారు. కిరీటం సొంతం చేసుకోవడంపై రేచల్ స్పందిస్తూ.. ఇలాంటి చెప్పుకోదగిన గుర్తింపును తన దేశానికి తీసుకురావడం ఆనందంగా, గర్వంగా ఉందన్నారు.

ప్రేయసిని చంపి.. వీఐపీ ఏరియాలో పాతిపెట్టి

కాన్పూర్‌లో దృశ్యం సినిమా తరహా నేరం



కాన్పూర్, అక్టోబర్ 27: బాలీవుడ్ సినిమా దృశ్యం చూడటం వల్ల వచ్చిన ఆలోచనతో ఓ జిమ్ ట్రైనర్ తనతో సంబంధాన్ని కొనసాగిస్తున్న మహిళ(32)ను చంపి కాన్పూర్‌లోని ఖరీదైన ప్రాంతంలో పాతిపెట్టాడు. తనకు వేరొక మహిళతో నిశ్చితార్థం జరగడంపై సదరు మహిళ అభ్యంతరం చెప్పడంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు నిందితుడు విశాల్ సోనీని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు మృతురాలు ఏక్తా గుప్తా శవాన్ని కాన్పూర్ జిల్లా జడ్జి అధికార నివాసం దగ్గర పోలీసులు వెలికి తీశారు. పోలీసుల కథనం ప్రకారం జూన్ 24న ఏక్తా గుప్తా విశాల్ సోనీతో జిమ్‌లో గొడవ పడింది. కోపంతో విశాల్ ఆమెను కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను అతడు అక్కడి నుంచి తీసుకెళ్లడం సీసీటీవీలో రికార్డైంది. ఆ తర్వాత ఆమెను హత్య చేసిన నిందితుడు నగరంలోని ఖరీదైన ప్రాంతంలో పాతిపెడితే ఎవరికీ అనుమానం రాదని భావించి జిల్లా జడ్జి ఇంటికి సమీపంలో ఆమెను పూడ్చి పెట్టాడు. నిందితుడితో ఏక్తా గుప్తాకు వివాహేతర సంబంధం ఉందన్న విషయాన్ని ఆమె భర్త రాహుల్ గుప్తా నిరాకరించారు. 'ఇది అపహరణ కేసు. నాలుగు నెలల్లో రెండుసార్లు మీడియా ద్వారా మేము కిడ్నాప్ సమాచారాన్ని అందించాం' అని ఆయన చెప్పారు.

చైనాలో వేలాది కిండర్‌గార్టెన్స్ మూత

- వేగంగా పడిపోతున్న జననాల రేటు
- ముగ్గురు పిల్లల విధానానికి స్పందన కరువు



బీజింగ్: చైనాలో జననాల రేటు పడిపోవడంతో వేలాది కిండర్‌గార్టెన్స్ మూతపడుతున్నాయి. 2023లో 14,808 కిండర్‌గార్టెన్స్ మూతపడినట్లు చైనా విద్యా శాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. వరుసగా మూడు సంవత్సరాల నుంచి కిండర్‌గార్టెన్‌లో చేరే చిన్నారుల సంఖ్య తగ్గిపోతున్నది. గత ఏడాది అంతకుముందు సంవత్సరం కన్నా 53.5 లక్షల మంది చిన్నారులు తగ్గిపోయారు. 2023లో 5,645 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. చైనా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే మందగమనంలో ఉంది. జననాల రేట్లు మొత్తం జనాభాకు అనుగుణంగా లేవు. మరోవైపు వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో జనాభాలో అసమతుల్యత వల్ల భవిష్యత్తులో ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

పిల్లల్ని కనేందుకు విముఖత

చైనాలో ప్రస్తుతం వృద్ధులు ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలపై ఆధారపడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతున్నది. 2016లో ఇద్దరు పిల్లలకు జన్మనివ్వడానికి దంపతులకు అనుమతి ఇచ్చారు. 2021లో దీనిని సవరించి ముగ్గురు పిల్లలకు జన్మనివ్వడానికి అనుమతించారు. కానీ ధరల భారం భయంతో దంపతులు ఎక్కువ మంది పిల్లలను కనేందుకు ఇష్టపడటం లేదు.

ఇక భయం లేని 'ఏకాంతం'!

'డిజిటల్ కండోమ్' యాప్‌ను లాంచ్ చేసిన జర్మన్ కంపెనీ



న్యూఢిల్లీ: బెడ్రూం కార్యకలాపాలు ఇటీవల సోషల్ మీడియాకెక్కి పరువును గంగపాలు చేస్తున్నాయి. ఈ ప్రైవేటు కార్యం రహస్య కెమెరాలకు చిక్కడంతో బోల్డన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో మధురంగా ఉండాల్సిన ఏకాంత క్షణాలు చేదు గుళికలుగా మారిపోతున్నాయి. అయితే, ఇకపై ఎలాంటి బెరుకు లేకుండా, తమను ఫొటోలు, వీడియోలు తీస్తారన్న భయం లేకుండా నిశ్చింతగా ఆ మధుర క్షణాలను ఆస్వాదించవచ్చు. ఇందుకోసం జర్మన్ సెక్సువల్ హెల్త్ బ్రాండ్ 'బిల్లీ బాయ్' సరికొత్త యాప్‌ను ఆవిష్కరించింది. 'కమ్‌డోమ్'గా పిలిచే ఈ యాప్ 'డిజిటల్ కండోమ్'గా వ్యవహరిస్తుంది. ఏకాంతంలో ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్లలోని కెమెరాలు, మైక్రోఫోన్లు పనిచేయకుండా ఈ యాప్ అడ్డుకుంటుంది. ఇకపై ఏకాంతంలో మనకు తెలియకుండా ఆ సీన్లను వీడియోలు, ఫొటోలు తీయడం, ఆడియోను రికార్డు చేయడం జరగదని బిల్లీబాయ్ పేర్కొంది. ఈ యాప్‌ను 30 దేశాల్లో విడుదల చేశారు. ఇది బ్లూటూత్ సాంకేతికతతో సమీపంలోని స్మార్ట్‌ఫోన్లను నిర్వీర్యం చేసి ఏకాంతాన్ని ఆహ్లాదంగా మారుస్తుంది. ఎవరైనా వీడియోలు, ఫొటోలు తీయాలనుకున్నా కమ్‌డోమ్ యాప్ వెంటనే రియాక్ట్ అవుతుంది. అలారం మోగి యూజర్లను అప్రమత్తం చేస్తుంది.